క్లుప్తంగా

మంత్రికి సన్మానం



పాలకుర్తి టౌన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును శుక్రవారం నియోజవర్గ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జేపీఎస్‌లు సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు యుగేందర్, కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు జి.రమ్య, మాదరాజు సంతోష్, వెంకటేష్, శ్రీకాంత్, మహేందర్, గణేష్ పాల్గొన్నారు.

నేడు మండలానికి మంత్రి రాక

కొడకండ్ల: మండలంలోని కొడకండ్ల, ఏడునూతులలో శనివారం నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరవుతారని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని సీతారామ గార్డెన్‌లో కొడకండ్ల 1, 2 ఎంపీటీసీల పరిధిలోని కొడకండ్ల, హక్యా, జీబీ తండా, మధ్యాహ్నం ఏడునూతుల మామిడి తోటలో ఏడునూతుల, నర్సింగాపురం, రంగాపురం, రేగుల, రేగులతండలకు ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు. అలాగే నర్సింగాపురంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీసోమేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి ఓఎస్‌డీ

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓఎస్‌డీ రవీందర్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఓఎస్‌డీని స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల: మండలకేంద్రంలోని టీఎస్‌ఆర్ ఎస్‌జేసీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు అతిథి పద్ధతిలో పనిచేయుటకు ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ కోరారు. కళాశాల స్థాయిలో గణిత, భౌతిక, రసాయన, జంతు, వృక్ష శాస్త్రాలు, పాఠశాల స్థాయిలో పీజీటీ తెలుగు, సంస్కృతం, హిందీ, గణితం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం, టీజీటీ ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం పోస్టులకు ఈ నెల 31 వరకు బయోడేటాతో పాఠశాలలో దరఖాస్తులు సమర్పించి డెమో క్లాసులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన నిపుణులచే ఎంపికలు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు ..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కస్తూర్బా పాఠశాలలో ప్రవేశం పొందేందుకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ స్వప్న తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. కస్తూర్బాలో 6వ తరగతి, ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు ఉపయోగించుకునేలా వారి తల్లిదండ్రులు కృషి చేయాలని ఆమె కోరారు.

గడువు పొడిగింపు

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాసం వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి చెందిన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపు ప్రవేశాలకు విద్యార్థులు టీఎస్ మోడల్ స్కూల్ అనే వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాల కోసం 9908438726, 9247992045 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో కాడెడ్లు మృతి

దేవరుప్పుల: ఎల్‌టీ లైన్ తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురై కాడెడ్లు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం కడవెండిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మండలంలోని కడవెండి వాగులోని చెక్‌డ్యామ్ ఏరియాలో పెద్ది శ్రీను తనకున్న కాడెద్దులను మేతకు తీసుకెళ్లాడు. మేతమేస్తూ వెళ్లిన కాడెద్దులు తెగిపడి ఉన్న ఎల్‌టీ లైన్‌కు తగలడంతో విద్యుత్‌షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయాడు. ఘటన స్థలాన్ని విద్యుత్‌శాఖ అధికారులు సందర్శించారు.

ఎన్‌హెచ్‌పై పొంచి ఉన్న ప్రమాదం



మీదికొండ క్రాస్‌రోడ్డు సమీపాన ఉన్న దాబాహోటల్



ఘన్‌పూర్ ఎస్సీ కాలనీ వద్ద క్రాస్‌రోడ్డు వద్ద ..



ఘన్‌పూర్ శివారు క్రాస్‌రోడ్డు వద్ద ఆర్‌ఆర్ దాబా

- క్రాస్‌రోడ్ల వద్దే దాబాలు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో హైదరాబాద్–హనుమకొండ జాతీయ రహదారిపై దాబా హోటళ్లు ప్రమాదకరమైన ప్రదేశాల్లో ఉన్నాయి. మీదికొండ క్రాస్‌రోడ్డు, స్టేషన్‌ఘన్‌పూర్ పాత శ్రీవాణి స్కూల్ సమీపాన, పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన, ఎస్సీకాలనీ వద్ద దాబా హోటళ్లు క్రాస్‌రోడ్డుకు దగ్గరలోనే ఉన్నాయి. ఈ దాబాలకు వివిధ వాహనాలపై వచ్చే వారు గతంలో రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. అయినా సంబంధిత అధికారులు, పోలీసులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలకు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్సై

నర్మెట: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ తప్పదని, గంజయా గుడుంబా, గుట్కా విక్రయిస్తే జైలు పాలేనని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేదమని ఎస్సై గైకాడి అనిల్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేసిన అనంతరం మల్కపేటలో కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాంను ఏర్పాటు చేసి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గుడుంబా, గుట్కా, గంజాయి వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సరైన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ప్రతీగ్రామంలో, పట్టణాల్లో సీసీ కెమెరాల నిఘా కొనసాగుతుందని.. దొంగలు తప్పించుకోలేరని తెలిపారు. మల్కపేట శివారులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఆయన వెంట పీసీలు రహమత్ అలీ, రాజు, ధనుంజయ్, రమేష్, ప్రవీణ్ ఉన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



జనగామ రూరల్: ఇండియా కరెన్సీపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఇందుకు సహకరించాలని శుక్రవారం ఢిల్లీలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే నూతన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

జఫర్‌గఢ్: ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి డి.దీప్తి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పంట పొలాల్లో ముందుగా జీలుగ విత్తనాలు సాగు చేయడం వల్ల రైతులు అధిక పంట దిగుబడి పొందే అవకాశం ఉంటుందన్నారు. విత్తనాల కోసం గ్రామాల్లోని రైతులు ఏఈఓలను సంప్రదించాలని ఆమె సూచించారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

దేవరుప్పుల: యోగా సాధనతో శారీరక, మానసిక ఉల్లాసం, ఆధ్యాత్మిక చింతన పెంపొంది సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురూజీ చిట్యాల మహేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని నీర్మాల హైస్కూల్‌లో ఐదు రోజుల యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగాభివృద్ధితో మానవులు శారీరక శ్రమకు దూరం కావడంతో అనేక జబ్బులు అనివార్యంగా సంతరించుకుంటున్నాయన్నారు. ఈ తరుణంలో యోగాతో అనేక రుగ్మతల నుంచి పరిరక్షణ పొందవచ్చని, విషతుల్యమైన ఆహారపు అలవాట్లకు స్వస్తి పలికి సహజ సిద్ధమైన పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన పూజలు

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలోని దుర్గామాత ఆలయంలో మహిళలు శుక్రవారం కుంకుమార్చన, అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కార్తీక్ శర్మ మాట్లాడుతూ దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించామన్నారు. గ్రామ సర్పంచ్ గట్టు మంజుల, ఎంపీటీసీ మామిడి అరుణ, ఉప సర్పంచ్ జూల కృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

ఉప కులాలను విస్మరించిన ప్రభుత్వం



కర పత్రాలను విడుదల చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ 57 ఉప కులాల సంక్షేమాన్ని విస్మరించిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాము కూడా దళితులమేనని దళితబంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఉపకులాలు అనాధిగా ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నాయని అలాంటి కులాలను విస్మరించడం చాలా బాధాకరమన్నారు. ఉపకులాలకు అన్యాయం చేయొద్దని ఈ నెల 29వ తేదీన ఛలో ఇందిరాపార్క్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. ఉప కులాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చలో ఇందిరాపార్క్ కర పత్రాలను విడుదల చేశారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ కృష్ణవేణి

స్టేషన్‌ఘన్‌పూర్: జూన్ 2 నుంచి నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆర్‌డీఓ కృష్ణవేణి అన్నారు. ఉత్సవాల నిర్వహణపై స్థానిక కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, దశాబ్ది ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు షెడ్యూల్ ప్రకారం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు

తరిగొప్పుల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం జేపీఎస్‌ల మండల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో భూక్య రాజేందర్, భూక్యం లింగం, అమనగంటి మహేందర్, మమత, భాగ్యలక్ష్మి , హరిత, నవనీత, మాధవి, కుమార్, రాజు, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

గో సంరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న మహేష్ అగర్వాల్

స్టేషన్‌ఘన్‌పూర్: గోవధ నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, గోసంరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండలంలోని చంద్రుతండాలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా చట్టవిరుద్ధకరంగా గోవులను వధించకుండా సంబంధిత శాఖకు కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. బక్రీద్ పండుగకు 30 రోజుల ముందుగానే ఈ ఆదేశాలు జారీ చేయాలని, గోవుల అక్రమ వధకు పాలపడుతున్న వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఆవులను, దూడలను స్వాధీనం చేసుకోవాలని, పశువులను వధకు విక్రయించే వారిపై నిఘా ఉంచాలని కోరారు. గోవులు, దూడల సంరక్షణ కోసం షెడ్లను నిర్మించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా గోవుల సంరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు. శివలింగం గోశాల అధ్యక్షుడు పి.యాకయ్య, కార్యదర్శి ఎం.కరణ్, సభ్యులు రమేష్, సూపరింటెండెంట్ దుర్గం రోజా పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులే నా బలం, ప్రజలే నా బలగం



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య తదితరులు

చిల్పూరు: బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులే తన బలం, నియోజవకర్గ ప్రజలే తన బలగమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. చిల్పూరు మండల క్లస్టర్–2 ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని మండలంలోని పల్లగుట్టలో శుక్రవారం నిర్వహించారు. చిల్పూరు శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు గెస్ట్‌హౌజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ, డీజే సౌండ్స్ పాటలు, కోలాటాలతో ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ఎమ్మెల్యే డప్పు దరువేయడంతో పాటు దూంధాం కళాకారులతో కలిసి స్టెప్పులేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పిల్లల డాక్టర్‌గా ఉన్న తాను స్థానిక నినాదంతో రాజకీయాల్లోకి లాగబడ్డానని, 13 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎమ్మెల్యేగా అయినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి పది సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా జూన్ 2 నుంచి దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఫాతిమామేరి, చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, ఆకుల కుమార్, మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూక్య రమేష్‌నాయక్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆరూరి ప్రణీత, కందుల రఘుపతి, పుట్ట అంజనీదేవి, ఎంపీటీసీలు జీడి ఝాన్సీ, యాదగిరి, సుధాకర్, నాయకులు కుమార్, రమేష్‌నాయక్, రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఎమ్మెల్యే పూజలు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో నిర్వహించిన దుర్గమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజయ్య శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయానికి విరాళం



చిల్పూరు: విరాళం అందజేస్తున్న దాత గడ్డి రవి



స్టేషన్‌ఘన్‌పూర్: విరాళం అందజేస్తున్న ఇందిర

చిల్పూరు: కొండాపూర్ గ్రామ దుర్గామాత ఆలయానికి షోడషపల్లి గ్రామ వ్యాస్తవ్యుడు గడ్డి రవి శుక్రవారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి తనవంతుగా రూ.లక్ష అందించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ లొడెం రజితరవీందర్, ఎంపీటీసీ మారబోయిన ఐలమ్మఎల్లయ్య, ఆలయ చైర్మన్ పసునూరి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజయ్య, కార్యదర్శి ప్రకాష్, బుచ్చిరాములు, తిరుపతి, పలికాషి రాజయ్య, రవి, నర్సయ్య పాల్గొన్నారు.


చర్చి వార్షికోత్సవానికి..

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని నిర్మలామాత చర్చి 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాలను పురస్కరించుకుని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర శుక్రవారం రూ.50వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక నిర్మలామాత చర్చి నిర్మించి 50 సంవత్సరాలు గడవడం, గోల్డెన్ జూబ్లీ వేడుకల నిర్వహణ చేయడం సంతోషకరమన్నారు. పార్టీ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు లింగాజీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ నేషనల్ డెలిగేట్ క్రాంతి, పార్టీ జిల్లా కార్యదర్శి చింత ఎల్లయ్య, నాయకులు కోరుకొప్పుల మహేందర్, సింగపురం వెంకటయ్య, నాగయ్య, రడపాక రాజ్‌కుమార్, సంపత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో ఆభరణాల చోరీ

జనగామ: చంపక్‌హిల్స్‌లోని మాత శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో ఓ బాలింతకు సంబంధించిన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. గత నాలుగు రోజుల కిందట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలింత జనరల్ వార్డులో ఉండగా బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఈ సమయంలోనే తన మెడపై ఉన్న ఆభరణాలను బాత్‌రూమ్‌లో పెట్టింది. తిరిగి తన పసికందుకు పాలిచ్చిన తర్వాత గుర్తెరిగి బాత్‌రూమ్‌లో పరిశీలించగా ఆభరణాలు అదృశ్యమయ్యాయి. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సృజన్ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించారు. ఈ విషయమై ఎస్సై మాట్లాడుతూ జనరల్ వార్డులో వందలాది మంది రాకపోకలతో సత్యరమే నిందితులను గుర్తించలేకపోయామని, బాధితులు తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదన్నారు. కాగా, సీసీ ఫుటేజీలను గుర్తిస్తే చోరీ సంఘటన వెలుగులోకి రానుంది. గతంలో ఆస్పత్రికి వచ్చే రోగుల సెల్‌ఫోన్లు పోయినా పట్టించుకునే నాథులు కరవయ్యారనే విమర్శలు ఉన్నాయి.

మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

జనగామ రూరల్: చీటకోడూర్‌లో రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఫేస్–1,2 చెక్ డ్యాంల నిర్మాణాలు అసంపూర్తిగా నాణ్యత ప్రమాణాలు లేకుండా జరిగాయి. అభివృద్ధి పనుల పేరిట కట్టపై గ్రామంలోని రామప్పకుంట నుంచి సదరు కాంట్రాక్టర్ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కాగా, గ్రామంలోని యువత మట్టితరలింపును గురువారం అడ్డుకుంది. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో 15 రోజులుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని వారు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పచ్చదనం గురించి వివరిస్తున్న కరుణాకర్

బచ్చన్నపేట: గ్రామాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌బీఎం డీసీ కరుణాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామంలో భారత్ మిషన్ క్షేత్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ కోనేటి స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పారిశుద్ధ్యంపై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచడమే గ్రామాధికారి లక్ష్యమని, అందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, టీఏ అనిల్ , ఉప సర్పంచ్ చవాన్ నరేష్, వార్డు సభ్యులు అనసూర్య, కృష్ణవేణి, రంజిత, పంచాయితీ కార్యదర్శి రుబీనా సుల్తానా పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

తరిగొప్పుల: పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ డైరెక్టర్ (మాజీ పీఏసీఎస్ చైర్మన్) అర్జుల సుధాకర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. సకాలంలో వాహనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలుపగా ఏసీపీ దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్సై నరేష్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కుమార్‌మాదిగ

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండలో జూన్ 4న నిర్వహించనున్న ఎస్సీ వర్గీకరణ సాధన ఉమ్మడి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం చేస్తామన్నారు. వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం చేపట్టిన ఉమ్మడి జిల్లా సదస్సుకు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం నుంచి జనసమీకరణ చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఇనుములు నర్సన్న, చాడ ఏలియా, నాగరాజు, గోవింద్, శ్రీధర్, అనిల్, మేడస్వామి, నవీన్, రాజు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

కొడకండ్ల: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు బీజేపీ ఆధ్వర్యంలో జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమన్న, అధికార ప్రతినిధి చింత సృజన్, కన్నయ్య, రాయుడు, పనస రాములు, రమేష్, అంజనేయులు, శ్రీను, సురేష్, అజయ్, పద్మారెడ్డి పాల్గొన్నారు.

బయట నిద్రిస్తే.. ఆభరణాలు ధరించొద్దు

రఘునాథపల్లి: భువనగిరి ప్రాంతంలో కొన్ని రోజులుగా రాత్రి సమయంలో వరుస దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరుగుతోన్న నేపథ్యంలో రఘునాథపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇతర ఏరియాలో దొంగల ముఠాలు వచ్చే ప్రమాదమున్న దృష్ట్యా మండలంలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై రఘుపతి శుక్రవారం పలు సూచనలు చేశారు. వేసవి కాలం కావడం, బయట నిద్రిస్తున్న మహిళల మెడలో ఉండే బంగారు అభరణాలు లక్ష్యంగా దొంగలు స్నాచింగ్‌లో పాల్పడుతున్నందున ముందు జాగ్రత్తలు అవసరమన్నారు. అపరిచితులు సంచరిస్తే వెంటనే 8712685211, 8712685035 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

అర్హులకు 'గృహలక్ష్మి' అందజేయాలి

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా నిలువ నీడ లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని వైఎస్సార్ టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింద శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు ప్రకటించిన తరుణంలో మండలానికి 500 చొప్పున ఊరూరా 17 ఇళ్లు మాత్రమే కేటాయింపు జరుగుతుందన్నారు. పేదల సంఖ్యకు అనుగుణంగా కోటా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.